కడలి - 1976

# ఆడపులి

మీటింగ్ జరుగుతోంది. అందరి మొహాల్లోనూ తెచ్చి పెట్టుకున్న సందడి సంబరం నిలువెత్తున లేచి నాట్యం చేస్తున్నాయి. ఒకళ్ళకొకళ్ళు నవ్వులు అందజేసుకున్నారు. చేతులు కలిపి చప్పట్లు కొట్టారు. గంటసేపు ఆ హాల్లో కోలాహలం రాజ్యం చేసింది. ఆఖర్ని శెక్రటరీగారి వందన సమర్పణతో సభ ముగిసింది. పట్టుచీరలు కార్లలోనూ, నైలక్స్ చీరలు రిక్షాల్లోనూ, నేత చీరలు కాలినడకనా తిరుగుమొహం పట్టాయి.

వినతి పట్టుచీర కట్టుకున్నవాళ్ళ జాబితాలోనూ, నైలక్స్‌చీరల వరసలోనూ జేరదు కాబట్టి నేతచీర కట్టుకుని నడిచి మీటింగ్‌కి వచ్చింది. అలాగే తిరుగుమొహం పట్టింది. పాపం ఓ పట్టుచీర కార్లో డ్రాపుచేస్తానని అడిగినా వినతి 'ఫరవాలేదని' నడవడం మొదలుపెట్టింది.

నిజానికి వినతికి యీ మీటింగ్‌కి రావడం సుతారామూ యిష్టం లేదు. కానీ తప్పలేదు. యీ హడావిడి వెనుక వున్నది స్వయంగా తన ఆఫీసరు. అందులో సాటి ఆడది - మహలక్ష్మిగారు.

"వినతీ, వరకట్నం నిషేదించాలి మన ఆడవాళ్ళంతా. ఇన్నాళ్ళకి ప్రభుత్వం శాసనాలు కూడా చేస్తోంది. ముందుతరం వాళ్ళకి మంచిరోజులు వచ్చేటట్టు వున్నాయి" అంది.

వినతి మాట్లాడలేదు.

ఆఫీసరు ఓ గంట ఆఫీసు పని పక్కకి నెట్టి సభ ఏర్పాట్లు గురించి చెప్పింది. అధ్యక్షత వహిస్తోన్న పెద్ద మనిషి గుణగణాలు వర్ణించింది. ఆడవాళ్ళ బాధ్యతలను గురించి చెప్పింది. ఆపైన నెమ్మదిగా అసలు విషయం బయటపెట్టింది.

"నీకు తెలుగులో మంచి ప్రవేశముందని విన్నాను. ఈ దురాచారం మీద నాలుగు మాటలు రాసిపడేయి. తీరా నేను మాటల కోసం తడుముకుంటే బావుండదు" అని.

వినతి కాదనలేకపోయింది. ఓ అరటావు తీసుకుని రెండు మూడు ముక్కలు గీకిపారేయాలనుకుంది. కానీ మనసులో యేమూలదాక్కుందో తెలియని ఆవేదన - తీగలా సాగి రెండు పేజీలయింది. అదే మరోసారి చూసుకుని చేతికిస్తే "ఓసారి నువ్వు చదివి విన్పించు" అంది.

వినతి తలవంచుకుని మొదలుపెట్టింది... చదువుతుంటే గుండె దడదడా కొట్టుకుంది. మాటలు స్వచ్ఛంగా కాక తడబడ్డాయి. ఎందుకో ఆవేశం వచ్చి - అది చేతకాని ఆవేశం

అని తెలుసుకుని, కంఠం వణకడం మొదలుపెట్టింది.

తనేం వ్రాసింది... 'అందం, ఆపైన ఆకర్షణ, చదువు, యింకా యింకా, సంస్కారం – నేటి ఆడపిల్లలను యేవిధంగానూ రక్షించలేకపోతున్నాయి. డబ్బున్న వాళ్ళ యిళ్ళల్లో పుట్టినవాళ్ళకి డబ్బున్నవాళ్ళని వల్లో వేసుకోగల జాణతనం వున్న అమ్మాయిలకే పెళ్ళిళ్ళు అవుతున్నాయి...

"నువ్వేలాంటి దానివయినా ఫర్వాలేదు. నీలో యెన్ని అవకరాలు, యెన్ని అవకతవకలు వున్నా సహించగల్ను – డబ్బుతో రా... చాలు" అనే దృక్పథంతో నేటి యువకులు వుండడం – వాళ్ళ దురదృష్టం కాదు అటువంటి వాళ్ళల్లోంచి భర్తల్ని ఎన్నుకోవాల్సి వచ్చిన ఆడవాళ్ళదే శాపం."

వినతికి తెలుసు. యెన్ని సభలు జరిగినా – యెన్ని శాసనాలు చేసినా ప్రయోజనం యెంతటిదో...

యింతవరకూ ఎంతోమంది ఆడపిల్లలు యీ అగ్నికి ఆహుతయ్యారు. మధ్యతరగతి యింటిలో పుట్టకూడదని చెంపలు వేసుకోవడమే కాకుండా మరో తరగతిలోకి వెళ్ళాలని కలలు కని మోసపోయిన స్నేహితుల్ని కూడా తను చూసింది.

అందరి మాటా అనవసరం. ముంచేతి కంకణానికి వేరే అద్దం కూడా వెదుక్కోవడం అనుచితం. తను యేమిటి? తన బ్రతుకెలా సాగింది. యెన్ని యెదురు దెబ్బలు తినవల్సి వచ్చింది.

వినతికి పదేళ్ళ తన అవివాహిత జీవితం వద్దనుకుంటూనే జ్ఞాపకం రావడం మొదలుపెట్టింది. రుచి చూసిన అవమానాలు, చవిచూసిన చేదులు సూదులై గుండెల్లో ప్రవహించడం మొదలుపెట్టాయి. మగవాళ్లంటే అసహ్యం, వాళ్ళ ప్రవర్తన పట్ల భయం కొండమాదిరి యెదుగుతూనే వచ్చింది. ఎంతోమంది బ్రహ్మచారులు వినతిని విసిగించారు. కలవరపెట్టారు. అలాంటి వాళ్ళల్లో ప్రథముడు శ్రీహరి.

శ్రీహరి ఆ ఆఫీసులో వుద్యోగానికి వచ్చిన యేడాదికి వినతికి అదే ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ అయింది. అతను బ్రహ్మచారి. ఆఫీసులో పని చేస్తున్న మగవాళ్ళ చరిత్రలకంటే ఆడవాళ్ల జాతకాల్ని కూపీతీయడంలో శ్రీహరి దిట్ట. ఆడవాళ్ళ గురించి ఆలోచిస్తూ, లేకపోతే వాళ్ళతో కల్పించుకుని మాట్లాడుతూ కాలం వెళ్ళమారుస్తాడు. ఐదేళ్ళ సర్వీసులో అతను సంపాదించుకున్న కీర్తిప్రతిష్ఠలు యేవన్నా వుంటే అవి ఆడవాళ్ళతో మాత్రమే ముడిపెట్టుకుని వున్నాయని అతను గర్వంగా చెప్పుకుంటాడు. పెళ్ళికాని ఆడది అతనికి ప్రియురాలిగానూ, పెళ్ళయిన ఆడదీ దొంగ పతివ్రతగానూ కన్పిస్తూ వుంటారు. ఇది అతని జబ్బు.

ఈ జబ్బుతోనే అతనికి పాతికేళ్ళ అవివాహిత, సంసారం నడుపుకుందుకు (అంటే తల్లీదండ్రీ యింకా తమ్ముళ్ళు చెల్లెళ్ళు) వుద్యోగం చేస్తున్న వినతి – చాలా తేలిగ్గా వలలో

పడే ఆడదానిగా కన్పించింది. అతను అందుకే వినతి కోసం యెన్నో వుచ్చులు పన్నాడు. పార్టీలకు ఆహ్వానించాడు. రూమ్‌కి కాఫీకి రమ్మనమన్నాడు. లిడోకి వెడదామన్నాడు. ఆ క్రితం రోజు ఆఫీసరు మహాలక్ష్మి చదవడానికి వినతి తయారుచేసిన వుపన్యాసం చూసిన తర్వాత అతనికి వినతి కొంచెం అర్థం అయినట్టు అన్పించింది. అందుకే వినతిని వంటిగా చూసి -

"మీతో మాట్లాడాలి. వీలవుతుందా" అన్నాడు.

"చెప్పండి" అంది.

"అంటే యెలా చెప్పాలో తెలియడంలేదు"

"అయితే నన్నేం చేయమంటారు?" అంది చిన్నగా నవ్వి.

"రేపు సాయంత్రం యెలాగూ మీటింగ్‌కి వెడతాం మనం. ఓ గంట ముందు మనం అలా షాపింగ్‌కి వెడదాం."

"సరే" అంది వినతి. శ్రీహరిని సూటిగా చూసి.

కాఫీహోటల్లో, స్పెషల్‌రూమ్‌లో, శ్రీహరి విశ్వరూపం కొద్దికొద్దిగా వినతికి దర్శనం అయింది.

వినతి అంటే జాలిట. అందుకే కోరినంత డబ్బు వెదజల్లుతాట్ట. వినతంటే ప్రేమట. అందుకోసం అతనికి లొంగిపోవాలిట. పెళ్ళిమాట మరిచిపోవాలి. అసలు పెళ్ళి అనేది అంత అవసరమయిన తతంగం కానే కాదుట. ఏవేవో మాట్లాడాడు.

వినతికి మనసంతా కెలికినట్టయింది. అంతలో దుఃఖం అంతలో నిరాశ కలిగాయి.

అవును. ముప్ఫై యేళ్ళ అవివాహితని యింతకు మించి గౌరవంగా చూడదేమో సంఘం తన అర్హతల్ని లెఖ్ఖ కట్టి చూపిస్తూన్న శ్రీహరి మీద కాదు కోపం వస్తా! తనని కన్న తల్లిదండ్రుల మీద. ఒకవేళ వుండడం అంటూ జరిగితే, వునికి అంటూ వుంటే - ఆ పిచ్చి దేవుడి మీద.

బాధపడ్డానికి కూడా హద్దు వుంది. కన్నీరు కార్చడానికికూడా నియమం వుంది. అవి దాటితే ఆడదైనా, మగవాడైనా రాక్షసులుగానే మారతారు. మొండితనం కలగనేకూడదు! కలిగిందంటే దాని పర్యవసానం యెలా వుంటుందో ఫలితం వూహించడం కష్టం.

శ్రీహరికి యేం జవాబిచ్చిందీ వూహించుకుంటోంది వినతి. చేదైన నవ్వు పెదాల మీద కదిలింది. ఏవేవో వూహలు మెదడు మీద వికృతంగా నాట్యం చేస్తున్నాయి.

చటుక్కున తన ముందు ఆగిన కారు చప్పుడికి హారన్ మోతకి యీలోకంలోకి రాక తప్పలేదు వినతికి.

"భలేదానివే. నీ గురించి హాలంతా వెదికించాను. నడిచి వెడ్తున్నావా. కారెక్కు" అంది మహాలక్ష్మిగారు పక్కడోర్ తెరిచి.

"ఫరవాలేదండి. నడిచే వెడతాను. ఇంటికి దగ్గరపడ్డాను". నెమ్మదిగా అంది.

"ఫర్లాంగ్ దూరం నుంచి నిన్ను చూస్తున్నాను. పది టాక్సీలు నిన్ను దయదలిచి వదిలేశాయి. లేకపోతే యీ పాటికి హాస్పిటల్‌కి వెళ్లేదానివి."

వినతి నవ్వింది కారు యెక్కక తప్పలేదు.

"ఏమిటీ దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్" అంది మహాలక్ష్మి కారు స్టార్టు చేస్తూ.

"బ్రతుకు గురించి" తల వొంచుకునే అంది వినతి.

మహాలక్ష్మి "వోస్ అంతేనా" అని పకపకా నవ్వేసింది.

"నువ్వు బాధపడ్డా ఆశ్చర్యపడ్డా యిది నిజం వినతీ!" అంది మహాలక్ష్మి భారంగా.

"మీరింత బాధని యెలా అణచి పెట్టుకున్నారు. ఇది ఆత్మవంచన కాదా."

"అవమానం కన్నా ఆత్మవంచన గొప్పది. కష్టాలు భగవంతుడి కల్పితాలు అనుకున్నప్పుడు – మానవులు యేం చెయ్యాలి చెప్పు! ఆయనగారు పన్నిన వలని ఛేదించుకోవాల్సిన బాధ్యత మనమీద కూడా వుంది".

"అయితే" వినతి ఆగిపోయింది.

"మరేం చేయమంటావు. ఇరవై యేళ్ళ వయస్సులో వుద్యోగంలో చేరాను. మావాళ్ళ తప్పులేదు. ఎన్నో సంబంధాలు తెచ్చారు. నా కర్మకొద్దీ నేను యెవరికీ నచ్చలేదు. పెళ్ళికి నేను దూరం అవుతూనే వచ్చాను" ఆగి అంది మహాలక్ష్మి.

'మాకు డబ్బులేదు. నా అంతట నేనుగా వెళ్ళి 'నన్ను కట్నం లేకుండా పెళ్ళి చేసుకోగల చావ నీకుందా అని' యెవర్నీ అడగలేదు. అలాగే రోజులు గడిచాయి. నాకు నేను ఓదార్చుకోవడం నేర్చుకున్నాను. పెళ్ళి మాటా, ఆ వుద్దేశాన్నీ పక్కకి నెట్టి బెనారస్ వెళ్ళి ఏం.ఎ. చేశాను. ఫస్టన పాసయ్యాను. అక్కడైనా విజయం దొరికినందుకు మురిసిపోయాను. ఉద్యోగంలో ప్రమోషన్లు వచ్చాయి. వూర్లు తిరిగాను. ఇట్టే పదేళ్ళకాలం నా వయసుని పెంచింది."

"మాలా మీరు నిందలు భరించవల్సిరాలేదా? యే భయం లేకుండానే..." వినతి అడగకూడదనుకుంటూనే అనూహ్యమైన ప్రశ్న వేసింది.

"అవును – వినతీ... ఆడది అందగత్తె కానక్ఖరలేదు. వయసులో వుంటే చాలు, అడివి మృగాలు వాసనపట్టడానికి. ఒకటి రెండు బలాత్కారాల నుంచి, నాలుగైదు విషమ సమస్యల నుంచి తెలివిగా బయటపడ్డాను. మగవాడు బలవంతుడు. వయసులో వున్న ఆడదాన్ని చూస్తే పులిగా మారతాడు. అందుకని ఆడదెప్పుడూ ఆడపులిగా మారి అతగాణ్ణి రెచ్చగొట్టకూడదు. సాధ్యమయినంతవరకూ వాళ్ళని బోనులో పడేటట్టు చూడాలి. ఓ చక్కని నవ్వు, హొయలు చాలు యెంతటి రాక్షసుణ్ణయినా మైనంగా మార్చడానికి. మత్తుజల్లి తప్పించుకోవడానికి."

"మీకు అదృష్టం కలిసివచ్చి వుండచ్చు. కానీ అవివాహితులందరికీ..."

మహాలక్ష్మి మాట మారుస్తూ అంది. 'అవన్నీ యెందుకులే వినతీ.... నీకు వయసు మించిపోలేదు. నాలా నీ జీవితం కాకూడదు నా కథ నువ్వు ప్రమాణంగా తీసుకోవాలని చెప్పలేదు. నా అనుభవం చెప్పాను. నలభై యేళ్ళ పడుచుని నేను. నా దుఃఖం బాధా మరెవరికీ వద్దు. నీకు పెళ్ళి కావాలి. పిల్లల్ని కనాలి. నీకు అండగా నేవుంటాను. భయం లేదు. శ్రీహరి లాంటివాళ్ళని యెలా అదుపులో వుంచాలో నాకు తెలుసులే" అంది.

వినతి యెక్కడో ఆలోచిస్తోంది చాలాదూరంగా. అక్కడ సుందర స్వప్నాలు లేవు. అది స్వర్గసీమ అంతకన్నా కాదు. మామూలు ప్రపంచం కూడా కాదేమో అది!

❖ ❖ ❖

వారం తరువాత హఠాత్తుగా వినతి తన పెళ్ళిశుభలేఖలు పంచుతూంటే ఆఫీసులో వాళ్ళంతా ఆశ్చర్యపోయారు.

వినతి స్నేహితులు మురిసిపోతే వినతి అంటే కిట్టనివాళ్ళు కళ్లు కుట్టుకున్నారు.

వినతి శుభలేఖ చూసి కంగుతిన్న వాళ్ళలో శ్రీహరి మొదటివాడు. అయినా కంగ్రాట్యులేషన్స్ చెప్పాడు. మహాలక్ష్మి గారయితే కుర్చీలోంచి లేచి వినతిని కౌగించుకున్నంత పని చేసింది.

"నే చెప్పలా - యింకేం, పెళ్ళికూతురివి అయిపోయావు - యిట్టే"

"అవునండీ."

"వరుడెవరు - చుట్టాలతనా? పై సంబంధమా."

"కొంచెం దూరంబంధువు."

వినతి వారం శెలవు తీసుకుంది. ఆ పైన మరోవారం శెలవు పొడిగించింది. శెలవయి రాగానే ఆఫీసు వాళ్ళంతా మళ్ళీ శుభాకాంక్షలు చెప్పారు. పార్టీ యిమ్మన్నారు. మహాలక్ష్మిగారి ఆధ్వర్యంలో డబ్బు కలెక్ట్ చేసి వినతి కోసం వో సోఫాసెట్టూ, రేడియో కొనడానికి పథకాలు వేశారు. వినతి తనకి పార్టీ వద్దంది. మొండికేసింది.

మహాలక్ష్మి వినతిని పిలిచి బ్రతిమలాడింది. మెమో ఇస్తానంది నవ్వుతూ.

సాయంత్రం మీవారిని మా యింటికి తీసుకురా. అతగాణ్ణి నేను అడుగుతాను."

"వారికి యిటువంటి వంటే కిట్టవు మేడమ్. అందుకని చెప్తున్నాను" వినతి నెమ్మదిగా అంది.

"అదేం లేదు. పార్టీ సంగతి తరువాత చూద్దాం. మా యింటికి మీరు రండి చెప్తాను" అనేసింది గట్టిగా.

వినతి యేదో చెప్పబోతూంటే వద్దని వారించింది.

భర్తతో కాకుండా వంటిగా వచ్చిన వినతిని చూసి మహాలక్ష్మి ఆశ్చర్యపోయింది.

"ఏమిటిలా చేశావ్" అంది తల వంచుకుని నుంచున్న వినతిని చూసి.

"నన్ను క్షమించండి."

"అంటే"

"నాకు పెళ్ళి కాలేదు. అందుకనే మావార్ని తీసుకురాలేదు" అంది.

"యూ, సిల్లీ"

"నిజం మేడమ్... నాకు పెళ్ళి కాలేదు."

"అంటే గొడవలేవన్నా జరిగాయా... పెళ్ళి ఆగిపోయిందా."

వినతి కళ్ళలో వర్షించే మేఘాలు విజృంభించాయి. వాటికి పోటీగా వినతి తన పెదాల మీదికి నవ్వుని తెచ్చుకుంది.

"ఈ పెళ్లి అంతా నాటకం మేడమ్. పెళ్లికాని ఆడపిల్లగా నాకు రక్షణ లేదనిపించింది. వుండదూ, దొరకదూ అన్పించింది. ఇలా వేషం మారిస్తే నా మనుగడకి భయం తప్పుతుందనిపించింది. అందుకే యిలా చేశాను."

"అంటే.."

"సజావయిన కారణం చూపించకుండా చాలామంది పెళ్లికొడుకులు నన్ను తిరస్కరించారు. నా మెళ్ళో తాళి కట్టడానికి ముందుకు రాలేకపోయారు. దానివల్ల నాకేం బెంగ లేదు. కానీ - నన్ను నేను రక్షించుకుందుకు నా మెళ్ళో నేనే వో తాళి కట్టుకున్నాను. యీ వేళ నుంచి నేను పెళ్ళి అయిన ఆడపిల్లని. యీ రోజు నుంచి నాకు పెళ్ళి కానందుకు పెదాలు విరుచుకునేవాళ్ళ సంఖ్య తగ్గుతుంది. నాకు పెళ్ళికానందుకు సంబరపడేవాళ్ళు వెనక్కి తిరుగుతారు. నేను ఆఫీసు నుంచి యింటికీ - యింటి నుంచి ఆఫీసుకూ హాయిగా వస్తాను. యెలా వుంది మేడమ్ నా ఐడియా."

వినతి మాటలు వింటూ బొమ్మలా వుండిపోయింది మహాలక్ష్మి.

"మీ కాలంలో పెళ్లి కాని ఆడపిల్లని వెలివేశేవారు. దేవుడు దాని మొహాన పెళ్ళి రాత రాయలేదని వూరుకొనేవారు. కానీ యీ కాలం వేరు మేడమ్. పెళ్ళి కానందుకు ఆడపిల్లకి మరో రకం శిక్ష వేయడానికి పెళ్ళికాని తనాన్ని ఆసరాగా తీసుకునేందుకు అనేక మంది కాచుకుని వుండే రోజులు యివి. మీరు చెప్పారు. ఆడది ఆడపులిగా మారకూడదని, కానీ నాక నమ్మకం కలగడం లేదు మేడమ్. యిప్పటి రోజులూ, మగవాళ్ళు, ఆడవాళ్ళని ఆడవాళ్ళుగా వుండనివ్వడం లేదు. ఆడది ఆడపులిగా మారితే గాని బ్రతకలేదనే నిజాన్ని వాళ్ళకి పదే పదే గుర్తు చేస్తున్నారు. యిది యిలా కొనసాగితే ఆడవాళ్ళు పులులవుతారు. మరో దారి వుండదు."

మహాలక్ష్మికి యేం మాట్లాడాలోతెలియలేదు. భయంగా నిర్జీవంగా పేలవంగా వుండే వినతి కళ్ళల్లో అప్పుడే ఆడపులి రక్తారుణ కాంతులు కదలాడ్డం చూసి ఆవిడ ఖిన్నురాలయింది.

❖